క్లుప్తంగా

ఆధార్ అనుసంధానం చేసుకోండి: తహసీల్దార్

తలకొండపల్లి: ఓటర్‌కార్డును ఆధార్‌కార్డుతో అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ కృష్ణ అన్నారు. సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఒకే ఇంటి నంబర్‌తో 6 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లను గుర్తించడం జరిగిందన్నారు. ఆ ఓటర్లందరూ ఒకే ఇంటిలో నివసిస్తున్నారా లేదా అని విచారణ చేశామన్నారు. మండలంలో 143 మందికి చెందిన ఇంటి నంబర్లు తప్పుగా ఉన్నాయని.. అవి మార్చడానికి వారివారి ఆధార్‌కార్డును తహసీల్దార్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట, జనుము విత్తనాలు: ఏఓ

తలకొండపల్లి: మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రంలో 65 శాతం రాయితీపై జనుము, పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టా పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ తీసుకొని విస్తరణాధికారిని సంప్రదించాలని రైతులకు సూచించారు. 40 కేజీల బస్తా రూ.3500 ఉండగా.. రాయితీపై రూ.1225కి లభిస్తోందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎన్టీఆర్ ఘాట్‌కు టీడీపీ నేతల పాదయాత్ర

ఆమనగల్లు: ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణం నుంచి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వరకు పలువురు టీడీపీ నాయకులు పాదయాత్రగా బయలుదేరారు. టీడీపీ నాయకులు ముత్యాల పరమేశ్, దేవేందర్‌యాదవ్ చేపట్టిన పాదయాత్రను సోమవారం టీడీపీ సీనియర్ నాయకులు బ్రహ్మం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు యాదయ్య, వెంకటస్వామి గౌడ్, వజ్రలింగం, శేఖర్‌యాదవ్, భాస్కర్‌గౌడ్, శ్రీశైలం, యాదగిరి, సత్యానారాయణ, రాము, శ్రీశైలం, అశోక్, బాలకృష్ణయ్య, శరణయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గొర్రె మృతి

ఇబ్రహీంపట్నం: విద్యుత్‌ఘాతానికి గురై గొర్రె మృత్యువాత పడిన సంఘటన సోమవారం యాచారం మండల పరిధిలోని మేడిపల్లిలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన యాదయ్య గొర్రెలు.. గడ్డి మేసుకుంటూ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాయి. అక్కడ విద్యుదాఘాతానికి గురై ఒక గొర్రె మృత్యువాత పడింది. విద్యుత్ అధికారులు తనకు నష్టపరిహారం ఇవ్వాలని బాధితుడు కోరుతున్నాడు.

చల్లంపల్లిలో కంటివెలుగు శిబిరం

కడ్తాల్: మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో సోమవారం ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, గ్రామ సర్పంచ్ కృష్ణ యాదవ్ కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు మంజుల, ప్రియ, ఉపసర్పంచ్ జైపాల్‌రెడ్డి, రామకృష్ణ, డాక్టర్ చంద్రసింగ్, పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డి

మంచాల: మంచాల మండల కేంద్రంలోని డీసీఎంఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని మంచాల సర్పంచ్ అనిరెడ్డి జగన్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. వివిధ గ్రామాల నుంచి రైతులు వరిధాన్యం విక్రయించడానికి కొనుగోలు కేంద్రం వద్దకు ధాన్యం తీసుకొని వచ్చారు. సకాలంలో కొనుగోలు చేయకపోవడంతో వర్షాలు వచ్చి వరిధాన్యం పాడైపోయే ప్రమాదం ఉందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకొని వచ్చి ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే వచ్చిన వరి ధాన్యం వచ్చినట్టుగా కొనుగోలు చేయాలన్నారు. విక్రయించిన ధాన్యం బిల్లులు కూడా త్వరితగతిన వచ్చే విధంగా చూడాలన్నారు.

పిట్టల రవీందర్‌కు సన్మానం



రవీందర్‌ను సన్మానించిన నాయకులు

మంచాల: రాష్ట్ర మత్స్యపారిశ్రామిక సహకార సంఘాల చైర్మన్ పిట్టల రవీందర్ ముదిరాజ్‌ను సోమవారం మంచాల మండల పరిధిలోని నోముల మత్స్య కార్మిక సంఘం అధ్యక్షుడు చింతకింది చక్రపాణి ఆధ్వర్యంలో నేతలు కలిశారు. పిట్టల రవిందర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చక్రపాణి మాట్లాడుతూ.. పిట్టల రవీందర్ ముదిరాజ్ చైర్మన్‌గా ఎన్నిక కావడం చాలా సంతోషకరమైన విషయమన్నారు. ఆయన భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం ప్రధాన కార్యదర్శి గంట విజయ్, ఉపాధ్యక్షుడు కృష్ణ, కోశాధికారి జంగయ్య, కార్యవర్గ సభ్యులు హన్మంత్, మహేందర్, జంగయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపనకే పరిమితం

- సబ్ రిజిస్ట్రార్ నూతన భవన నిర్మాణానికి గ్రహణం
- 2022 ఫిబ్రవరిలో మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన
- త్వరగా పూర్తిచేయాలంటున్న స్థానికులు



మంత్రి కేటీఆర్ వేసిన శిలాఫలకం

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ నూతన భవన నిర్మాణ పనులు ఒక్క అడుగూ ముందుకు పడటంలేదు. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని పాత బస్తీలోని పాత బస్టాండ్ వద్ద వున్న పురాతన గోదాములను తొలగించి ఆ స్థలంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి 9 ఫిబ్రవరి, 2022లో శంకుస్థాపన చేశారు. రూ.1.50 కోట్లతో భవన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అయితే శంకుస్థాపన చేసి 15నెలలు దాటినా భవన నిర్మాణ పనుల్లో ఎలాంటి పురోగతి లేదు.

పాతబస్తీకి కొత్త కళ వచ్చేనా..

ఒకప్పుడు కళకళలాడిన పాత ఇబ్రహీంపట్నం కొన్నేళ్లుగా వెలవెలబోతోంది. సాగర్ ప్రధాన రహదారిపైకి పోలీస్‌స్టేషన్‌ను తరలించడం ఆ రోడ్డుకు చుట్టుముట్టూ కొత్త కాలనీలు వెలియడం, పాత బస్టాండ్ కేవలం హైదరాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులకు మాత్రమే పరిమితం కావడం, పలు వ్యాపార సంస్థలు, విద్యాసంస్థలు, కూరగాయలతోపాటు వివిధ మార్కెట్లు అటువైపు తరలడంతో పాతబస్తీకి వచ్చే జనసంచారం తగ్గిపోయి కళతప్పింది. అయితే సబ్ రిజిస్ట్రార్‌తోపాటు కొత్తగా వచ్చే వివిధ కార్యాలయాలు, మార్కెట్లను ఇక్కడ ఏర్పాటు చేస్తే తిరిగి పాతబస్తీ పూర్వవైభవం సంతరించుకొని వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయని స్థానికులంటున్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటైతే ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానికులకు ఉపాధితో పాటు వ్యాపారాలు బాగా సాగే అవకాశాలు ఉంటాయని స్థానికులు అంటున్నారు.

అద్దె భవనంలో తప్పని తిప్పలు..

ప్రస్తుతం ఇబ్రహీంపట్నంలోని ఓ ఇరుకైన అద్దె భవనంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం కొనసాగుతోంది. వందలాది మంది ఈ కార్యాలయానికి నిత్యం వస్తుండటంతో ఇరుకు భవనంలో విధులను నిర్వహిస్తున్న అధికారులకు తిప్పలు తప్పడంలేదు. అంతేగాక పార్కింగ్ సౌకర్యం లేక రోడ్లపైనే వాహనాలను నిలపాల్సి వస్తోంది. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురౌతున్నాయి. కొత్త భవనం నిర్మిస్తే ఈ ఇబ్బందులు తప్పి, అధికారులు, కార్యాలయానికి వచ్చే వారికి సౌకర్యంగా ఉంటుంది. వెంటనే భవన నిర్మాణం పూర్తిచేయాలని వారు కోరుతున్నారు.

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



సబ్ రిజిస్ట్రార్ నూతన భవన నిర్మాణ పనులు ప్రారంభించాలని పాతబస్తీ వాసులం స్థానిక ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవన నిర్మాణ పనులు మొదలు అవుతాయని, టెండర్ ప్రక్రియ కొనసాగుతుందని ఎమ్మెల్యే చెప్పారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఏర్పాటుకు ఎమ్మెల్యే ఎంతో కృషిచేశారు.

– భాస్కర్, ఇబ్రహీంపట్నం, బీఆర్ఎస్ నాయకుడు

పనులు ప్రారంభం కాలేదు



పాత ఇబ్రహీంపట్నం అభివృద్ధి చెందాలంటే కొత్తగా ఏర్పడే ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ మార్కెట్లను ఇక్కడ ఏర్పాటు చేయాలి, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేసి 15 నెలలు దాటింది. ఇంకా పనులు ప్రారంభంకాలేదు. పనులు ప్రారంభించేలా వెంటనే చర్యలు తీసుకోవాలి.

– అలీం, ఫిర్జాద్‌మహిల్, ఇబ్రహీంపట్నం

ఉపాధి అవకాశాలు లభిస్తాయి



సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పాత బస్టాండ్ వద్ద ఏర్పాటు చేస్తే స్థానికంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. టిఫిన్ సెంటర్లు, టీ కొట్టులు, జిరాక్స్, డాక్యుమెంట్ రైటర్ల షాపులు ఏర్పాటు అవుతాయి. వెనుకబడ్డ పాత బస్తీ బాగుపడే అవకాశం ఉంటుంది. త్వరలో సబ్‌రిజిస్ట్రార్ భవన నిర్మాణ పనులు ప్రారంభించి పాత బస్తీకి పూర్వవైభవం తీసుకురావాలి.

– రమేష్‌గౌడ్, ఇబ్రహీంపట్నం

నిరుద్యోగ భృతి ఏమైంది: బీజేవైఎం



సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు

తలకొండపల్లిలో సీఎం దిష్టిబొమ్మ దహనం

తలకొండపల్లి: సీఎం కేసీఆర్ నిరుద్యోగులకు ఇచ్చిన హామీ మేరకు నిరుద్యోగ భృతి మంజూర్ చేయాలని బీజేవైఎం కల్వకుర్తి నియోజకవర్గ కన్వీనర్, ఉప సర్పంచ్ అనిల్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గత 9 ఏళ్లుగా ఉద్యోగాలు కల్పించకుండా.. నిరుద్యోగ యువతపై నిర్లక్ష్యధోరణి వహిస్తోందంటూ సోమవారం మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉద్యోగం లేని ప్రతి నిరుద్యోగుడికి ప్రతినెలా రూ.3016 ఇస్తానని చెప్పి మోసం చేశారని అన్నారు.అనంతరం సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి పాండు, జిల్లా కార్యవర్గ సభ్యులు మహేష్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ అనిల్, మండల అధ్యక్షుడు శ్రీకాంత్, కుమార్, శాంతకుమారి, బాలకృష్ణ, రవి, శేఖర్, కుమార్, యాదయ్య పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలి

ఎంపీడీఓ రాఘవులు



ఇంకుడుగుంత నిర్మాణానికి మార్కింగ్ వేస్తున్న సిబ్బంది

ఆమనగల్లు: ప్రతి ఇంటికి ఇంకుడుగుంత నిర్మించాలని మాడ్గుల ఎంపీడీఓ రాఘవులు సూచించారు. మాడ్గుల మండలంలోని నల్లవారిపల్లి, అవురుపల్లి గ్రామాల్లో సోమవారం ఎంపీడీఓ రాఘవులు పర్యటించారు. ఆయా గ్రామాల్లో కమ్యూనిటీ ఇంకుడుగుంతల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అలాగే ఆయా గ్రామాల్లో మరుగుదొడ్లకు ఒకే గుంత ఉన్నచోట అదనపు గుంతను నిర్మించి మరుగుదొడ్లను సక్రమంగా వినియోగించుకోవాలని అవగాహన కల్పించారు. పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నల్లవారిపల్లి సర్పంచ్ పార్వతమ్మ, ఆయా గ్రామాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో ఆదిబట్ల



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఆర్తిక

మున్సిపల్ చైర్‌పర్సన్ ఆర్తిక

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చైర్‌పర్సన్ కొత్త ఆర్తిక పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో పాలకవర్గం సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన జరిగింది. ఇంజినీరింగ్, పరిపాలన విభాగం, పారిశుద్ధ్య విభాగాలకు సంబంధించిన అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇంజనీరింగ్ విభాగంలో వివిధ వార్డుల్లో అభివృద్ధి నిర్వహణ, మెయింటెనెన్స్ పనులకు సంబంధించి రూ.636 లక్షలకు పాలకవర్గం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ కలమ్మ, కౌన్సిలర్లు లావణ్య, మౌనిక, మహేందర్, నిరంజన్‌రెడ్డి, అర్చన, మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి, ఏఈ వీరాంజనేయులు, మేనేజర్ శ్రీనివాస్, టీపీఓ హబీబ్ ఉన్నీసా బేగం, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమావేశం మధ్యలో వెళ్లిపోయిన సభ్యులు..

సమావేశం జరుగుతుండగా మధ్యలోనే వైస్ చైర్‌పర్సన్ కళమ్మ, కౌన్సిలర్ మహేందర్ సమావేశాన్ని బైకాట్ చేసి వెళ్లిపోయారు. ఏకపక్షంగా సమావేశం నిర్వహిస్తున్నారని కోరం లేకున్నా తీర్మానాలు చేసుకుంటున్నారని మండిపడ్డారు. సరైన కోరం లేకపోయినా తీర్మానాలు ఎలా చేస్తారని.. ఈ విషయమై కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామని కౌన్సిలర్ మహేందర్ తెలిపారు .

జెడ్పీహెచ్‌ఎస్‌లో వసతులు కల్పిస్తాం

అభిమన్యు యూత్



స్కూల్ ప్రధాన గేట్ వద్ద సభ్యులు

ఇబ్రహీంపట్నం: రాయపోల్ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌కు ప్రహరీ, ప్రధాన గేట్ లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు, కుక్కలకు, పందులకు నిలయంగా మారింది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఆ గ్రామ అభిమన్యు యూత్ ఉదారత్వాన్ని చాటుకుంది. యూత్ సభ్యులు పాఠశాలకు ప్రధాన గేట్‌ను తయారు చేయించారు. విద్యార్థులకు పాఠశాలలో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.

పంట నష్టపరిహారం అందించాలి



దెబ్బతిన్న బొప్పాయి తోటను పరిశీలిస్తున్న నాయకులు

మంచాల: వడగండ్ల వర్షాలకు పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆరుట్ల సర్పంచ్ కొంగర విష్ణు వర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చీరాల రమేష్ డిమాండ్ చేశారు. మంచాల మండలంలోని ఆరుట్ల గ్రామంలో వడగండ్ల వర్షాలకు దెబ్బతిన్న పంట చేలను సోమవారం వారు పరిశీలించారు. ప్రభుత్వం పంట నష్టపోయిన రైతుల వివరాలను సేకరించి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జంగయ్యగౌడ్, రైతుబంధు కన్వీనర్ చిందం రఘుపతి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాష, నాయకులు జంగయ్య, చంద్రయ్య, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, ఐలయ్య, రాము, వెంకటేశ్, మోహన్‌రెడ్డి, అషు తదితరులు పాల్గొన్నారు.

భూములను లాక్కుంటే సహించేది లేదు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట దళితుల ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న దళితులు

మంచాల: ఏళ్ల తరబడిగా తాము కబ్జాలో ఉన్న భూమిని యాదవులకు కేటాయించడం నిలిపివేయాలని జాపాల గ్రామ దళితులు సోమవారం మంచాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్ అనితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 96 సర్వే నంబర్‌లో మా తాతల కాలం నుంచి దళితులము కబ్జాలో ఉన్నామన్నారు. గ్రామంలో 68 ఎకరాలు ప్రభుత్వం భూమి ఉంది. అ భూములను కాదని కావాలని దళితులు కబ్జాలో ఉన్న 96 సర్వేనంబర్‌లో యాదవులకు ఇస్తామడం శోచనీయమన్నారు. వాస్తవాలను పరిశీలన చేసి దళితులకు న్యాయం చేయాలన్నారు. దళితులు కబ్జాలో ఉన్న భూమిని యాదవులు తీసుకోవడం కూడా సరైంది కాదన్నారు. కొంతమంది కావాలని దళితుల భూములను లాక్కొన్ని గ్రామంలో గొడవలు సృష్టించాలని చూస్తే సహించేది లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ధర్నాకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జంగయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు సంజీవ, సీపీఎం మండల నాయకులు లెనిన్, ఆఫీస్ పాష, నోముల కృష్ణ, జంగయ్య, సంజీవ, రమేష్, హరికృష్ణ, పరమేష్, నందు, శివకుమార్, విష్ణు తదితరులు మద్దతు తెలిపారు.

పీఆర్సీ కమిటీని నియమించండి: ఎస్టీయూ

మంచాల: ప్రభుత్వం నూతన పీఆర్సీ కమిటీని సకాలంలో నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు ఏ.వీ.సుధాకర్ సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. జూలైలో నూతన పీఆర్సీ కమిటీని నియమించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. జాప్యం లేకుండా నిర్ణీత గడువు లోపల కమిటీ రిపోర్టును అందించేలా ఆదేశాలివ్వాలని కోరారు. ఫిట్‌మెంట్, రిపోర్టులో అంశాలపై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి గత పీఆర్సీ మాదిరిగా వేతన జీవులకు నష్టం జరుగకుండా మెరుగైన పీఆర్సీని ప్రకటించే విధంగా ప్రణాళిక తయారు చేయాలన్నారు. మెరుగైన పీఆర్సీ ప్రకటించి ప్రభుత్వం ఉద్యోగుల పక్షపాతిగా నిరూపించుకోవాలన్నారు. గత పీఆర్సీలో పెండింగ్ జీఓలను వెంటనే విడుదల చేయాలన్నారు.

నల్లవెల్లి నర్సరీ పరిశీలన

ఇబ్రహీంపట్నం: నల్లవెల్లి గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పంచాయతీ రికార్డులను యాచారం ఎంపీడీఓ విజయలక్ష్మి సోమవారం పరిశీలించారు. వన నర్సరీని పరిశీలించారు. హరితహారం కార్యక్రమం ప్రారంభమయ్యేలోపు మొక్కలను సిద్ధంగా ఉంచాలని ఎంపీడీఓ నర్సరీ సిబ్బందిని ఆదేశించారు.

'ఉపాధి' పనుల పరిశీలన

ఇబ్రహీంపట్నం: చర్లపటేల్‌గూడలో ఉపాధి హామీ పనులను ఇబ్రహీంపట్నం ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతికిరణ్ సోమవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడి అందుతున్న సౌకర్యాలు, ఇబ్బందుల గురించి తెలుసుకున్నారు. కూలీలకు రావాల్సిన బాకాయిలు, చెల్లింపుల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గీతారాంరెడ్డి, ఎంపీటీసీ ఆంజనేయులు, ఉపాధిహామీ అడిషనల్ ప్రోగ్రాం ఆఫీసర్, తిరుపతిచారి, గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి కేసులో..

తండ్రి సహా ఇద్దరు కుమారుల రిమాండ్

అబ్దుల్లాపూర్‌మెట్: విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ బస్ డ్రైవర్‌ను దూషించడంతోపాటు తన కుమారులతో కలిసి గాయపర్చిన తండ్రిని, అతని ఇద్దరు కుమారులను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మైలా శ్రీనివాస్ హయత్‌నగర్–1 డిపోలో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం సాయంత్రం దిల్‌సుఖ్‌నగర్ నుంచి దేశ్‌ముఖి రోడ్డులో బస్సు నడుపుతుండగా మార్గ మధ్యలో ఎన్టీఆర్‌నగర్ వద్ద అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామానికి చెందిన సత్యానారాయణ అనే వ్యక్తి బస్సు ఎక్కాడు. ఈ క్రమంలో డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగిన సత్యానారాయణ డ్రైవర్ శ్రీనివాస్‌ను దూషించడంతో పాటు బస్సు అబ్దుల్లాపూర్‌మెట్ వద్దకు రాగానే అతని ఇద్దరి కుమారులు రాఘవేందర్, రవికిరణ్‌ను పిలిపించాడు. ముగ్గురు కలిసి డ్రైవర్ శ్రీనివాస్‌పై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సత్యానారాయణతో పాటు అతని ఇద్దరు కుమారులు రాఘవేందర్, రవికిరణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

వరదనీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

నాగోలు: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ నాలాలలో మట్టిని తొలగించే కార్యక్రమం వేగవంతం చేశామని, వరదనీరు రాకుండా పటిష్ఠ చర్యలు తీసుకున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తపేట డివిజన్‌లో చేపట్టే వివిధ అభివృద్ధిపనులకు కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తి అయినట్లు తెలిపారు. త్వరలోనే మిగతా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. స్నేహపురి కాలనీలో కాలనీ సంక్షేమ భవనం శిథిలావస్థకు చేరిందని దాని కోసం నిధులు కేటాయిస్తామని తెలిపారు. మాజీ కార్పొరేటర్లు సాగర్ రెడ్డి, ప్రకాశ్ గౌడ్, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రాహుల్ గౌడ్ పాల్గొన్నారు.

మాదన్నపేటలో అక్రమ పార్కింగ్ వసూళ్లు రద్దు

చంచల్‌గూడ: అక్రమ పార్కింగ్ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ సర్కిల్–7 డిప్యూటీ కమిషనర్ నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్తీలోని మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో నిర్వహిస్తున్న అక్రమ పార్కింగ్ వసూళ్లకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో అక్రమ పార్కింగ్ వసూళ్లపై జీహెచ్ఎంసీకి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టి ఎట్టకేలకు పార్కింగ్ వసూళ్లపై నిషేధం విధించారు. ట్రేడ్ లైసెన్స్ కోసం స్వయంగా ఆన్‌లైన్‌లో అప్లై చేసే వెసులుబాటు ఉండటంతో అక్రమంగా ట్రేడ్ లైసెన్స్ పొందినట్లు అధికారులు గుర్తించారు. సరైన పత్రాలు లేకుండా ట్రేడ్ పొంది అక్రమ పార్కింగ్ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు జోనల్ కమిషనర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. రెండు నెలల పాటు విచారణ చేపట్టిన అధికారులు ఎట్టకేలకు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేశారు. ఇకపై అక్రమ పార్కింగ్ వసూళ్లకు పాల్పడితే జీహెచ్ఎంసీ, పోలీసులకు ఫిర్యాదు చేయాలని డిప్యూటీ కమిషనర్ నరసింహ తెలిపారు. పార్కింగ్ వసూళ్ల రద్దు విషయమై మాదన్నపేట పోలీసులకు సమాచారమిస్తామని ఆయన తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ఎంపీపీ కమ్లీమోత్యానాయక్



ఇంకుడుగుంతల పనులను ప్రారంభిస్తున్న అధికారులు

కడ్తాల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. పారిశుద్ధ్య నిర్వహణ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సోమవారం మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, ఎంపీడీఓ రామకృష్ణ, ఈజీఎస్ ఏపీఓ లలిత పర్యటించారు. మురుగు నీరు నిలవకుండా చూసుకోవాలని అవగాహన కల్పించారు. ఇంకుడుగుంతల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇంటి ఆవరణలో స్థలం ఉంటే ఈజీఎస్ సహకారంతో ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని సూచించారు. మ్యాజిక్ సోక్‌పిట్‌కు రూ.6500, కామన్ సోక్‌పిట్‌కు రూ.10300, కమ్యూనిటీ సోక్‌పిట్‌కు రూ.12 వేలు ఈజీఎస్ కింద అందజేస్తామన్నారు. సర్పంచ్ తులసీరాంనాయక్, కార్యదర్శి సత్యం, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీను, వార్డుసభ్యులు ఉన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి..

కడ్తాల్: గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్ అన్నారు. ఇటీవల మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్–2023లో విజేతలుగా నిలిచి.. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు సోమవారం మండల కేంద్రం నుంచి హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ సన్మానించారు. జిల్లా స్థాయిలోనూ రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి జంగయ్య, పీడీ చంద్రమోహన్, పీఈటీ భీముడు, రమేశ్, పరమేశ్, ఎస్ఎంసీ చైర్మన్ చందర్, శ్రీనివాసచారి, రంగయ్య, రమేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

నీటిని ఆదా చేసుకుందాం..

అబ్దుల్లాపూర్‌మెట్: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం మిషన్ మీరి రైఫీ సందర్భంగా మహిళలకు నీటి వనరుల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ పద్మజ, సీడీపీఓ వినీత, పీహెచ్‌సీ డాక్టర్ శ్వేత, సర్పంచ్ చెరుకు కిరణ్‌కుమార్‌గౌడ్ హాజరై వర్షపు నీటి సేకరణ, ఎలా నిల్వ చేసుకోవాలి, సురక్షితమైన తాగునీటి సరఫరాతో పాటు, మరుగుదొడ్డి వద్ద నీటి ఆదా వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్యాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

వర్షపు నీటిని ఒడిసిపడదాం..

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలను తవ్వి వర్షపు నీటిని ఒడిసిపట్టాలని ఇబ్రహీంపట్న ఇన్‌చార్జి ఎంపీడీఓ క్రాంతి కిరణ్ సూచించారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండలంలోని పోచారం, కప్పపహాడ్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. గ్రామ పంచాయతీల్లో పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం ఉపాధి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రోగ్రాం అధికారి తిరుపతిచారి, పంచాయతీ కార్యదర్శులు విక్రం, శ్రీనివాస్, టెక్నికల్ అధికారులు రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.